ప్రజా విశ్వంభర


# భక్తి శ్రద్ధలతో ఘనంగా వరలక్ష్మీ వ్రతాలు



విశ్వంభర, నెల్లికుదురు: శ్రావణమాసంలో నిర్వహించే పవిత్రమైన పండుగ వరలక్ష్మి వ్రతాలను మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు, ఇనుగుర్తి మండల కేంద్రాలతో పాటు అన్ని గ్రామాలలో మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో శుక్రవారం జరుపుకున్నారు. నియమ నిష్ఠలతో సొంత గృహాలలో వరలక్ష్మి దేవి వ్రతాలను కొందరు జరుపుకోగా,దగ్గరలోని ఆలయాలకు వెళ్లి సామూహిక వ్రతాలలో మరికొందరు పాల్గొన్నారు.వరలక్ష్మీ దేవిని పూజిస్తే అష్టలక్ష్మి లైన (ధాన్యం, ధైర్యం, సంతానం, విజయం, విద్యా, ధనం, గజ, సౌభాగ్య లక్ష్మి)లను పూజించినట్లేనని వ్రతాన్ని గొప్పగా ఆచరించారు. సిరుల తల్లి కటాక్షంతో ఇంట్లో సుఖసంతోషాలు,ధనధాన్యాలు సమకూరాలని వేడుకున్నారు.వివాహిత మహిళలు తమ కుటుంబ శ్రేయస్సు కోసము, భర్త ఆయురారోగ్యాలతో వర్ధిల్లి దీర్ఘకాలం సుమంగళిగా ఉండాలని జగజ్జనని కి మొక్కుకున్నారు. మండల కేంద్రం ఇనుగుర్తి చారిత్రక మహిమాన్విత శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో నిర్వహించిన సామూహిక వరలక్ష్మీ వ్రతాలలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని వ్రతాన్ని ఆచరించారు. దేవస్థాన ప్రధాన అర్చకులు తిరునహరి కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో వరలక్ష్మి వ్రతం నిర్వహించారు. లక్ష్మి అమ్మవారికి పంచామృతాభిషేకం, అలంకరణ,సామూహిక లక్ష్మి కుంకుమ అర్చనలు,తీర్థప్రసాదం వినియోగం జరిపించినట్లు వేద పండితులు కృష్ణమాచార్యులు తెలిపారు. వరలక్ష్మి వ్రతంలో స్థానిక సర్పంచి తమ్మడపల్లి కుమార్ సహధర్మచారిణి మాజీ ఎంపీటీసీ తమ్మడపల్లి రజిని, గాయత్రి గ్రానైట్స్ గ్రూప్ ఆఫ్ సంస్థల అతనేత వద్దిరాజు కిషన్ సతీమణి శశిరేఖ,వార్డు సభ్యురాలు గుండ్రపల్లి రమ గ్రామ మహిళలు పాల్గొన్నారు.

# ఆధునిక సాగు పద్ధతులపై రైతులకు శిక్షణ



విశ్వంభర, పెద్ద శంకరంపేట: రైతులు ఆధునిక సాగు పద్ధతులను అవలంబించి అధిక దిగుబడితో పాటు అదనపు ఆదాయం పొందాలని అధికారులు సూచించారు. పెద్ద శంకరంపేట రైతు వేదికలో ఆత్మ సౌజన్యంతో ఆర్పీఎల్ ఆధారిత రైతు శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక శాఖల అధికారులు పాల్గొని రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి నాగార్జున మాట్లాడుతూ ఒక ఎకరా భూమిలో కొంత భాగాన్ని పాడి పరిశ్రమకు, మరికొంత భాగాన్ని కోళ్ల పెంపకానికి, చేపల పెంపకానికి కేటాయించుకోవడం ద్వారా సమగ్ర వ్యవసాయంతో అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. వరి సాగుతో పాటు చేపల పెంపకం చేపట్టడం ద్వారా దీర్ఘకాలిక ప్రయోజనాలు పొందవచ్చని వివరించారు.

ఆయిల్‌పామ్ సాగు విధానం, యాజమాన్య పద్ధతులు, దీర్ఘకాలిక ఆదాయంపై క్షేత్ర సహాయకుడు అరుణ్‌కుమార్ అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారి నాగం కృష్ణ ప్రస్తుత పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పత్తి మొక్కల చివరి భాగాలను తుంచడం ద్వారా ఎక్కువ శాఖలు ఏర్పడి పూత, కాయలు అధికంగా వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. వరి సాగులో యూరియా గుళికలను వినియోగించే విధానాన్ని రైతులకు ప్రదర్శించి, దీంతో పిలకలు అధికంగా వచ్చి దిగుబడి పెరిగే అవకాశం ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి వినీత్, రైతులు పాల్గొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న రైతులకు అధికారులు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

# బాలికలు సైబర్ నేరాల పై అప్రమత్తంగా ఉండాలి

## భద్రతపై షీ టీం అవగాహన




విశ్వంభర, మహబూబాబాద్: బాలికలు సైబర్ నేరాలు, మానవ అక్రమ రవాణా, వేధింపుల పట్ల అప్రమత్తంగా ఉండాలని షీ టీం ఎస్సై సునంద కుమారి సూచించారు. జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకులం, జూనియర్ కళాశాలలో షీ టీం, సైబర్ నేర విభాగం, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్, భరోసా కేంద్రం ఆధ్వర్యంలో సుమారు 600 మంది విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సునంద కుమారి మాట్లాడుతూ బాలికలు తమ భద్రతపై అవగాహన కలిగి ఉండటంతో పాటు అనుమానాస్పద వ్యక్తులు, పరిస్థితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. షీ టీం విధులు, ఫిర్యాదుల స్వీకరణ, గోప్యతతో పరిష్కారం, మహిళలు, బాలికలకు అందించే రక్షణ సేవలపై వివరించారు. బాలల రక్షణ చట్టం, టి-సేఫ్ అనువర్తనం వినియోగంపై అవగాహన కల్పించారు. సైబర్ నేర విభాగం ఎస్సై కరుణాకర్ ఆన్‌లైన్ మోసాలు, నకిలీ లింకులు, సామాజిక మాధ్యమాల ద్వారా జరిగే మోసాలపై విద్యార్థినులకు వివరించారు. తెలియని లింకులు, సందేశాలు, ఫోన్‌కాల్స్‌కు స్పందించకూడదని, వ్యక్తిగత వివరాలు, సంకేతపదాలు, ఒకసారి వినియోగించే గోప్య సంకేతాలను ఎవరికీ వెల్లడించకూడదని సూచించారు.

సైబర్ మోసానికి గురైతే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. భరోసా కేంద్రం సిబ్బంది మహిళలు, బాలికలకు అందించే సహాయం, సలహాలు, ఇతర సేవల గురించి వివరించగా, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ సిబ్బంది మానవ అక్రమ రవాణా నుంచి రక్షణ పొందేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. విద్యార్థినులు క్రమశిక్షణతో చదువుకుని తమ లక్ష్యాలను సాధించాలని, భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసు అధికారులు సూచించారు. అత్యవసర సహాయం కోసం 112, మహబూబాబాద్ షీ టీం 8712656935, సైబర్ నేరాల కోసం 1930, బాలల సహాయం కోసం 1098, మహిళల సహాయం కోసం 181 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరి, అధ్యాపక సిబ్బంది, షీ టీం సిబ్బంది రమేష్, పార్వతి, సుధారాణి, ప్రియాంక, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ విభాగం సిబ్బంది అబ్దుల్ నాయక్, అరుణ, భరోసా కేంద్రం సిబ్బంది మౌనిక, బేబీ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు పెంచాలి

## జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్




విశ్వంభర, మహబూబాబాద్: జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థుల చేరికలను పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా విద్యాశాఖ అధికారి, మండల విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన విద్యాశాఖ సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యాశాఖ బలోపేతానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, ఆదర్శ పాఠశాలలు, జిల్లా పరిషత్ పాఠశాలలు, ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల చేరికలను పెంచి వారికి నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో ఆంగ్ల భాషపై ఆసక్తి, ఆత్మవిశ్వాసం, సంభాషణా నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో జిల్లా విద్యాశాఖ రూపొందించిన 'ఆంగ్ల భాషను చురుకైన భాగస్వామ్యంతో నేర్చుకోవడం' పుస్తకాన్ని కలెక్టర్ స్నేహ శబరిష్ ఆవిష్కరించారు. విద్యార్థులు ఆంగ్ల భాషను కేవలం పాఠ్యాంశంగా కాకుండా వినడం, మాట్లాడటం, చదవడం, రాయడం, చురుకైన భాగస్వామ్యం ద్వారా ఆచరణాత్మకంగా నేర్చుకునేలా ఈ పుస్తకాన్ని రూపొందించినట్లు అధికారులు తెలిపారు. తరగతి గదిలో విద్యార్థుల చురుకైన భాగస్వామ్యాన్ని పెంచడంతో పాటు ఆంగ్లంలో మాట్లాడే ధైర్యాన్ని, రోజువారీ సంభాషణా నైపుణ్యాలను అభివృద్ధి చేయడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆంగ్ల భాషలో నైపుణ్యం విద్యార్థులకు ఉన్నత విద్య, ఉపాధి, భవిష్యత్ అవకాశాలకు మరిన్ని మార్గాలను తెరుస్తుందని అన్నారు. ప్రతి విద్యార్థి ఆంగ్లంలో ఆత్మవిశ్వాసంతో మాట్లాడేలా పాఠశాల స్థాయిలో నిరంతర సాధనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. జిల్లాలోని ప్రతి పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, విద్యార్థుల్లో ఆంగ్ల సంభాషణా సామర్థ్యాలను పెంపొందించేందుకు మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణమూర్తి, శిక్షణలో ఉన్న ఉప కలెక్టర్ నితీష్, సహాయ విద్యాశాఖ అధికారి రాములు, జిల్లా పాఠశాలల అధికారి అప్పారావు, సమన్వయకర్తలు పూర్ణచందర్, సురేష్, వెంకటేశ్వర్లు, గాయత్రి, పర్యవేక్షకుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోళ్లలో పారదర్శకత ఉండాలి



విశ్వంభర, చిగురుమామిడి: గ్రామపంచాయతీలో వస్తువుల కొనుగోళ్లు నిబంధనల ప్రకారం పారదర్శకంగా జరగాలని రాష్ట్ర ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బొట్ల కార్తిక్ అన్నారు. ఇందుర్తి గ్రామ ఉపసర్పంచ్ చింతపూల అనిల్‌పై సర్పంచ్ చేస్తున్న ఆరోపణలను ఖండిస్తూ శుక్రవారం గ్రామంలో పర్యటించి అనిల్‌కు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కార్తిక్ మాట్లాడుతూ పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం కొనుగోళ్లకు సంబంధించి సరైన బిల్లులు రూపొందించి, నిబంధనల మేరకు తీర్మానాలు చేయాల్సి ఉంటుందన్నారు. ఫాగింగ్ యంత్రాలు, మోటార్లు, వీధి దీపాల కొనుగోళ్లలో అధిక ధరలు చూపిస్తూ బిల్లులు రూపొందించడాన్ని ఉపసర్పంచ్ ప్రశ్నించారని తెలిపారు. గ్రామాభివృద్ధికి తాను వ్యతిరేకం కాదని, నిధుల వినియోగంలో పారదర్శకత కోసమే ప్రశ్నిస్తున్నానని ఉపసర్పంచ్ అనిల్ తెలిపారు. సర్పంచ్ తనపై చేసిన ఆరోపణలను వెనక్కి తీసుకుని, పాలకవర్గ సభ్యులంతా కలిసి గ్రామాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వార్డు సభ్యుల రాష్ట్ర ఫోరం అధ్యక్షుడు సురేష్‌కుమార్, జిల్లా ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక చట్టాల పరిరక్షణకు ఉద్యమించాలి




విశ్వంభర, వలిగొండ: కార్మికుల హక్కులను పరిరక్షించేందుకు కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎండీ ఇమ్రాన్ పిలుపునిచ్చారు. వలిగొండ మండలంలోని దేవిశ్రీ గార్డెన్‌లో నిర్వహించిన ఏఐటీయూసీ మూడో మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బ్రిటిష్ కాలంలో కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి నాలుగు కార్మిక నియమావళిగా మార్చిందని, దీంతో కార్మికుల హక్కులు, ప్రయోజనాలకు తీవ్ర నష్టం జరుగుతోందని ఇమ్రాన్ ఆరోపించారు. కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టేందుకు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్మికులకు కనీస వేతన చట్టాలను కచ్చితంగా అమలు చేయాలని ఏఐటీయూసీ డిమాండ్ చేస్తోందన్నారు. అనంతరం వలిగొండ మండల ఏఐటీయూసీ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కనకబోయిన ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా ఎల్లంకి మహేష్ ఎన్నికయ్యారు. మండల కార్యవర్గ సభ్యులుగా కందుకూరి సంజీవ, ఐలపాక స్వామి, నానంచర్ల వెంకటేష్, గడ్డల నరసింహ, బొలుగుల రామ్మూర్తి, కసరబోయిన మహేష్‌లను ఎన్నుకున్నారు.

# మాజీ ఎమ్మెల్యే మాట మీద నిలబడాలి



విశ్వంభర, చండూరు: మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి తనపై చేసిన అవినీతి ఆరోపణలకు ఆధారాలు చూపాలని చండూరు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను గానీ, మున్సిపల్ పాలకవర్గ సభ్యులు గానీ ఎవరి వద్దైనా లంచం తీసుకున్నట్లు నిరూపిస్తే పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించారు.మాజీ ఎమ్మెల్యే మాట ప్రకారం శనివారం ఉదయం 9 గంటలకు శిర్ధపల్లి రోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయానికి వచ్చి ప్రమాణం చేయాలని కోరారు. తాను ఎలాంటి డబ్బులు తీసుకోలేదని ప్రమాణం చేస్తానని, ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యాపారులు కూడా తమకు ఎలాంటి డబ్బులు ఇవ్వలేదని ప్రమాణం చేసేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ప్రభాకర్‌రెడ్డి ప్రమాణానికి హాజరై తన ఆరోపణలను నిరూపించాలని, లేనిపక్షంలో ఆరోపణలను ఉపసంహరించుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలని కోడి శ్రీనివాసులు డిమాండ్ చేశారు.

# శిశు మందిర్‌లో సామూహిక వరలక్ష్మి వ్రతాలు



విశ్వంభర,పెద్ద శంకరంపేట: వరలక్ష్మీ వ్రతం పురస్కరించుకొని పెద్ద శంకరంపేట లోని శ్రీ సరస్వతి శిశు మందిర్ లో శుక్రవారం అధిక సంఖ్యలో మహిళలు సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. పూజారి రాయల కృష్ణ శర్మ వేద బ్రాహ్మణ పండితుల మంత్రోచ్చారణలతో సామూహికంగా మహిళలు వరలక్ష్మి వ్రతాలు చేశారు..ప్రత్యేకంగా అమ్మవారిని అలంకరించి మహిళలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి మంగళ హారతులతో పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం భక్తులందరికీ ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో శిశు మందిర్ పాఠశాల అధ్యక్షులు దాదిగారి గంగాధర్. ప్రధానాచార్యులు లక్ష్మీనారాయణ . ఆచార్యులు జైహింద్ రెడ్డి. శ్రీనివాస్ ప్రబంధ కారిని సభ్యులు శ్రవణ్ కుమార్ గాండ్ల సంగమేశ్వర్ రవి వర్మ సంతోష్ కుమార్. మాతాజీలు మహిళలు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తా: రాజు



విశ్వంభర, మహేశ్వరం: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని మహేశ్వరం మండల ఎస్సీ విభాగం నూతన అధ్యక్షుడు కప్పల రాజు తెలిపారు. తుక్కుగూడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రంగారెడ్డి జిల్లా ఎస్సీ విభాగం చైర్మన్ క్యారగారి శ్రీధర్ ఆధ్వర్యంలో కప్పల రాజును మహేశ్వరం మండల ఎస్సీ విభాగం అధ్యక్షుడిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా కప్పల రాజు నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు లభించిన పదవిని బాధ్యతగా భావిస్తున్నానని అన్నారు. మహేశ్వరం మండలంలోని అన్ని గ్రామాల్లో పర్యటించి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలను సమన్వయం చేసుకుంటూ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యత అప్పగించిన జిల్లా ఎస్సీ విభాగం చైర్మన్ క్యారగారి శ్రీధర్, నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డికి కప్పల రాజు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 67వ డివిజన్ అధ్యక్షుడు అయినాల విజయభాస్కర్‌రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు సమత ప్రకాష్, ఉపాధ్యక్షుడు బరిగల నరసింహ, ప్రధాన కార్యదర్శి బాకీ సల్మాన్, దేవాలయ కమిటీ చైర్మన్ బూడిద శ్రీకర్‌గౌడ్, కార్యదర్శి చిప్ప సురేష్, మాజీ అధ్యక్షుడు తొండపల్లి గిరి, మహేశ్వరం మండల సమన్వయకర్త బూసన్నగారి స్వామి, వీరేష్‌నాయక్, కప్పల జైసూర్య, చింటూ, రావుల లింగం, పవన్, భార్గవ్, భరత్‌తో పాటు సీనియర్ నాయకులు, కార్యకర్తలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# ఓబీసీలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలి: కల్పనా ఇనాందార్

## లోక్ తాంత్రిక్ న్యాయ్ అభియాన్' ప్రారంభించిన కల్పనా ఇనాందార్




విశ్వంభర, హైదరాబాద: జనాభా ప్రాతిపదికన సమగ్రత, ఓబీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం, న్యాయ సంస్కరణలు, రాష్ట్రాల సమాఖ్య హక్కుల పరిరక్షణ కోసం 'లోక్ తాంత్రిక్ న్యాయ్ అభియాన్'ను ప్రారంభించినట్లు లోక్ ఆందోళన్ న్యాస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్పనా ఇనాందార్ తెలిపారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ముఖ్యంగా ఆమె నాలుగు ప్రధాన డిమాండ్లను రాజకీయ పార్టీల ముందు వుంచారు. ఆగస్టు 31న ఈ నాలుగు అంశాల మీద ఇందిరా పార్క్ వద్ద ఉద్యమం మొదలవుతుందన్నారు. అంతేకాకుండా డీలిమిటేషన్, మహిళలకు 33% రిజర్వేషన్, కులాల సమాఖ్య న్యాయం, జనగణనలో ప్రత్యేక ఓబీసీ విభాగం, మహిళల రిజర్వేషన్లలో ఓబీసీ ఉపకోటా, న్యాయ నియామకాల్లో పారదర్శకత, స్థానిక న్యాయ ప్రతిభకు ప్రాధాన్యం వంటి అంశాలను ఆమె మాట్లాడుతారు. 2027 జనగణనలో ఓబీసీలకు ప్రత్యేక, ప్రామాణిక విభాగాన్ని ఏర్పాటు చేసి కులాలు, ఉపకులాలను శాస్త్రీయ పద్ధతిలో నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సామాజిక న్యాయ విధానాలకు కచ్చితమైన జనాభా గణాంకాలు అవసరమన్నారు. మహిళల రాజకీయ రిజర్వేషన్లలో ఓబీసీ ఉపకోటా కల్పించేలా రాజ్యాంగ సవరణ చేయాలని కోరారు. ఓబీసీ మహిళలకు రాజకీయాల్లో మరిన్ని అవకాశాలు కల్పించడంతో పాటు క్షేత్రస్థాయి మహిళా నాయకత్వాన్ని ప్రోత్సహించాలని అన్నారు. న్యాయ నియామకాల్లో పారదర్శకత, ప్రతిభ, సమాన అవకాశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని, అఖిల భారత న్యాయ సేవ (ఏఐజేఎస్)ను సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. కింది స్థాయి న్యాయస్థానాల్లో స్థానిక భాష, ప్రాంతీయ న్యాయ పరిజ్ఞానం ఉన్న న్యాయ నిపుణులకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. డీలిమిటేషన్ వల్ల ఏ రాష్ట్రానికీ ప్రాతినిధ్యం తగ్గకుండా రాజ్యాంగ సవరణ చేయాలని డిమాండ్ చేశారు. కొత్తగా పెరిగే లోక్‌సభ స్థానాలను రాష్ట్రాల ప్రస్తుత ప్రాతినిధ్యానికి అనుగుణంగా కేటాయించి దేశ సమాఖ్య రాజకీయ సమతౌల్యాన్ని కాపాడాలని కోరారు.

# బస్టాండ్ వద్ద టాయిలెట్స్ నిర్మాణానికి స్థల పరిశీలన



విశ్వంభర, నెల్లికుదురు: మండల కేంద్రం నెల్లికుదురు ఆర్టీసీ బస్టాండ్ వద్ద ప్రజల సౌకర్యార్థం టాయిలెట్స్ నిర్మించడానికి స్థలపరిశీలన చేశారు. ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నితీష్, స్థానిక సర్పంచి పులి వెంకన్న, ఎంపీడీవో సింగారపు కుమార్, మాజీ జెడ్పిటిసి హెచ్ వెంకటేశ్వర్లు తదితరులు బస్టాండ్ ఏరియాలోని సైడ్ కాలువ పక్కన ల్యాండ్ ను గుర్తించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కుమార్ మాట్లాడుతూ.. బస్టాండ్ ఏరియాలో ఆర్టీసీ సంస్థ గతంలో నిర్మించిన మరుగుదొడ్లు వినియోగించుకునేందుకు వీలుకాకుండా ఉండడంతో బస్టాండ్ వద్ద మరుగుదొడ్లు నిర్మించాలని ప్రజలు అభ్యర్థిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల జరిగిన ప్రజావాణిలో సైతం ఈ మేరకు వినతి పత్రం అందజేశారని పేర్కొన్నారు. బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికుల కోసం మరుగుదొడ్లు తక్షణ అవసరమన భావించి స్వచ్ఛభారత్ మిషన్ నిధుల నుంచి స్థానిక గ్రామపంచాయతీ టాయిలెట్స్ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచి మంచాల వెంకన్న,పంచాయతీ కార్యదర్శి ఏ. దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

# శ్రీసాయి సన్నిధి ట్రస్ట్ సభ్యుల ప్రమాణ స్వీకారం



విశ్వంభర, సరూర్ నగర్ : ఎన్టీఆర్ నగర్ డివిజన్ గ్రీన్ హిల్స్ కాలనీలోని శ్రీసాయిబాబా మందిరంలో ఎన్నికైన శ్రీసాయి సన్నిధి ట్రస్ట్ కమిటీ (రిజిస్ట్రేషన్ నెంబర్ బికె ఐవి 141/2026) సభ్యుల ప్రమాణ స్వీకారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా టిపిసిసి సభ్యుడు దేప భాస్కర్ రెడ్డి హాజరై నూతన కమిటీ సభ్యులను అభినందించారు. దేవాలయం అభివృద్ధికి నూతన కమిటీ సభ్యులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. నూతన కమిటీ ఛైర్మెన్ గా సురభి ఎల్లారెడ్డి, వైస్ చైర్మన్ గా పగిల్ల భూపాల్ రెడ్డి, కమిటీ సభ్యులుగా శేషనాలా రఘువీర్, తలాటి రమేష్ నేత, చిట్టెడి పుష్పలతరెడ్డి, ముప్పిడి లింగస్వామిగౌడ్, బండపల్లి కృష్ణారావ్, ఎన్.వీరారెడ్డి, ఏ.నాగేశ్వర్ రావు, బి.అన్నపూర్ణ, ఏం.శాంతిచంద్రరాజా, జి.రీతా, కె.చంద్రశేఖర్, బి.అన్నపూర్ణ, వి.సుధేష్ణ, ఎన్.సుధాకర్, మామిడి రామకృష్ణ గౌడ్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చిలుక ఉపేందర్ రెడ్డి, గట్ల రవీంద్ర, నానవాల జ్ఞానేశ్వర్ యాదవ్, పెద్దవూర సైదులు, దుబ్బాక శేఖర్, నరసింహ, కందుకూరి సుదర్శన్, యాదయ్య, గుణగంటి రమేష్, బబ్లూ, చిన్న తదితరులు పాల్గొన్నారు.